ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.4, కనిష్ఠం 28.2



నిజామాబాద్
జిల్లా వార్తలు

1

ఆదివారం 4 మే 2025

15లోగా ఎస్సెస్సీ రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ ఫీజు చెల్లించాలి: డీఈవో


నిజామాబాద్ అర్బన్, మే3 (ఆంధ్రజ్యోతి): ఎస్సెస్సీ ఫలితాల్లో రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ కొరకు మే 15లోగా ఫీజు చెల్లించి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు సంబంధించిన దరఖాస్తును బీఎస్ఈతెలంగాణ.కో.ఇన్ వెబ్‌సైట్ నుంచి తీసుకోవాలని, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన టీఎన్‌జీవోస్ నాయకులు



సమస్యలను వివరిస్తున్న టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు

సుభాష్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో షబ్బీర్‌అలీని కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు గత కొన్నిరోజులుగా కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు సుమన్ షబ్బీర్ అలీని కోరారు. దీనికి షబ్బీర్‌అలీ స్పందిస్తూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, త్వరలో సమస్యలన్నీ పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నేతికుంట శేఖర్, అసోసియేషన్ ప్రసిడెంట్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



పంటల రుణ పరిమితి పెంపు!

- ఖరారు చేసిన బ్యాంకర్ల కమిటీ
- వరి, పసుపు, మొక్కజొన్న, సోయాతో పాటు ఇతర పంటలకు వర్తింపు
- ఈ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారమే వచ్చే ఖరీఫ్, రబీలో రుణాలు

నిజామాబాద్, మే3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంట రుణాలను అందించేందుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను బ్యాంకర్ల కమిటీ ఖరారు చేసింది. ఈ కమిటీ నిర్ణయం ఆధారంగానే జిల్లాలో వేసే పంటలకు అన్ని బ్యాంకుల పరిధిలో రుణాలను అందించనున్నారు. ఖరీఫ్, రబీలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారమే టార్గెట్‌కు అనుగుణంగా రుణాలను మంజూరు చేయనున్నారు. గత సంవత్సరం కంటే ప్రధాన పంటలకు కొద్ది మొత్తంలోనే రుణ పరిమితిని పెంచారు. ఆరుతడి పంటల నుంచి వాణిజ్య పంటల వరకు ఇదే విధానాన్ని అవలంబించనున్నారు. రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకొని ఉత్తర్వులను జారీ చేశారు. అన్ని బ్యాంకులు ఈ ఆదేశాలను పాటించాలని కోరారు.

బ్యాంకర్ల కమిటీ నిర్ణయం మేరకే..

ప్రతీ సంవత్సరం రైతులు వేసే పంటలకు రుణ పరిమితిని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయిస్తుంది. రాష్ట్రంలో పండే పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు, వాణిజ్య పంటలు, పౌల్ట్రీ, పాడిపరిశ్రమ రంగాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా రుణ పరిమితిని పెంచుతారు. సాగునీటి వనరులు ఉన్న ప్రాంతంలో వేసే పంటలతోపాటు నీటి సదుపాయం లేకుండా వర్షాల మీద ఆధారపడి వేసే పంటలకు కూడా రుణ పరిమితిని నిర్ణయిస్తారు. దానికి అనుగుణంగానే రెండు సీజన్‌లకు ఈ రుణాలను ఆ నిర్ణయం ఆధారంగా బ్యాంకుల అధికారులు మంజూరు చేస్తారు. ఈ సంవత్సరానికి కూడా నాలుగు రోజుల క్రితం రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పంటలకు సంబంధించిన రుణ పరిమితిని 1000 నుంచి 2వేల వరకు పెంచారు. గతంతో పోలిస్తే పెంపు తక్కువగానే ఉన్న అన్ని బ్యాంకులు ఈ నిబంధనలు పాటించాలని జిల్లాలకు ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లా బ్యాంకర్ల కమిటీ ఆధ్వర్యంలో ఈ ఖరీఫ్, వచ్చే రబీలో ఈ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారమే రుణాలను అందించనున్నారు.

కొద్దిమొత్తంలోనే పెంపు

ఈ సంవత్సరం వేసే పంటలకు రుణ పరిమితిని కొద్దిమొత్తంలో పెంచారు. రైతులు వేసే పంటలకు అనుగుణంగా ఈ రుణపరిమితి ప్రకారం ఇవ్వనున్నారు. గత సంవత్సరం వరికి 44వేల వరకు రుణాలు ఎకరానికి ఇవ్వగా ఈ సంవత్సరం 2వేలు పెంచి 46వేలు ఇవ్వనున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు ఈ రుణాన్ని అందించనున్నారు. జిల్లాలో అత్యధికంగా వరి సాగు కొనసాగుతుంది. రైతులు ఎక్కువ మొత్తంలో ఈ పంటనే వేస్తున్నారు. ఈ పంటకు పెట్టుబడి కూడా ఎక్కువగా పెడుతున్నారు. ప్రస్తుతం 2వేలు పెంచడం వల్ల ఖరీఫ్, రబీలో ఎకరాకు 46వేలు ఇవ్వనున్నారు. విత్తనోత్పత్తి చేసే వరి రైతులకు ఎకరాకు 50వేలు రుణం అందించనున్నారు. జవార్‌కు గత సంవత్సరం 19వేలు ఉండగా ఈ సంవత్సరం 21వేలకు పెంచారు. విత్తనోత్పత్తి చేసే రైతుల కోసం 26వేలకు రుణ పరిమితిని పెంచారు. జొన్న 16వేల నుంచి 18వేలకు, రాగులు 15వేల నుంచి 17వేలకు పెంచారు. జిల్లాలో వరి తర్వాత అత్యధికంగా వేసే మొక్కజొన్నకు 28వేల నుంచి రుణ పరిమితిని 30వేలకు పెంచారు. చిరు ధాన్యాలకు 20వేల నుంచి 22వేలు, కందులు 23వేల నుంచి 25వేల వరకు, మినుములు 20వేల నుంచి 22వేలకు, పెసర 20వేల నుంచి 22వేల వరకు, శెనగ 25వేల నుంచి 27వేల వరకు, పొద్దుతిరుగుడు 28వేల నుంచి 30వేల వరకు పెంచారు. సోయాబిన్ 28వేల నుంచి 30వేలకు పెంచారు. సోయాబిన్ విత్తనోత్పత్తి చేసే రైతులకు ఎకరాకు 34వేల నుంచి 36వేలకు పెంచారు. వేరుశనగకు 26వేల నుంచి 28వేలు, నువ్వులు 20వేల నుంచి 22వేలు, ఆముదం 20వేల నుంచి 21వేలు, పత్తి 46వేల నుంచి 48వేలకు పెంచారు. పత్తి విత్తనోత్పత్తి చేసే రైతులకు ఎకరాకు లక్షా 40వేల నుంచి లక్షా 50వేల వరకు రుణ పరిమితిని పెంచారు. చెరకు రైతులకు ఎకరాకు 80వేల నుంచి 82వేలకు పెంచారు. మిర్చీ పండించే రైతులకు ఎకరాకు 84వేల నుంచి 86వేలకు, ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు 46వేల నుంచి 48వేలకు పెంచారు.

ఆరుతడి పంటలకూ వర్తింపు

కూరగాయలు సాగు చేసే రైతుల కోసం రుణ పరిమితిని పెంచారు. టమాట పండించే రైతుల కోసం ఎకరాకు 55వేల నుంచి 57వేలకు పెంచారు. వంకాయ 55వేల నుంచి 57వేలు, మునగ 34వేల నుంచి 36వేల వరకు, అల్లం 69వేల నుంచి 71వేలు, వెల్లుల్లి 38వేల నుంచి 40వేలకు పెంచారు. జిల్లాలో వరి, మొక్కజొన్న తర్వాత అత్యధికంగా పండించే పసుపు పంటకు ఎకరాకు 88వేల నుంచి 90వేలకు పెంచారు. ఇవే కాకుండా ఇతర కూరగాయల పంటలకు కూడా వెయ్యి నుంచి 2వేల వరకు పెంచారు. పండ్లతోటల కోసం కూడా రుణ పరిమితిని వెయ్యి నుంచి 2వేల వరకు పెంచారు. పాడిపరిశ్రమ కోసం గేదెలకు ఇచ్చే రుణ పరిమితిని కూడా 33వేల నుంచి 35వేలకు పెంచారు. ఆవులకు 33వేల నుంచి 35వేలకు చేశారు. గొర్రెల కోసం రుణ పరిమితి 26వేల నుంచి 28వేలకు పెంచారు. ఈ పెంచిన రుణపరిమితి ప్రకారం ఈ ఖరీఫ్‌తో పాటు వచ్చే యాసంగిలో రుణాలను పంపిణీ చేస్తామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో బ్యాంకర్ల కమిటీ నిర్ణయం తీసుకొని జిల్లాకమిటీకి పంపించిందని తెలిపారు. అన్నిబ్యాంకులకు ఈ వివరాలను పంపించామన్నారు. జిల్లాస్థాయిలో సమావేశం కాగానే జూన్ ఆరంభం నుంచి రుణాలను రైతులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

నేడు నీట్ పరీక్ష

- జిల్లావ్యాప్తంగా ఎనిమిది పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్షకు హాజరుకానున్న 3,398 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా యంత్రాంగం

నిజామాబాద్ అర్బన్, మే3 (ఆంధ్రజ్యోతి): మెడికల్, అగ్రికల్చర్‌లలో సీట్ల కోసం నిర్వహించే నీట్ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఎనిమిది పరీక్షా కేంద్రాలలో నీట్ పరీక్ష నిర్వహణ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, గేల్‌హనుమాన్ సమీపంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నాగారంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలతోపాటు బోధన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలోగల ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాల, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. జిల్లావ్యాప్తంగా 3,398మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి కనీసం అరగంట ముందు లోనికి చేరుకోవాల్సి ఉంటుందని నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని నిర్వాహకులు కోరారు. అభ్యర్థులను ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు మాత్రమే అనుమతిస్తారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. అభ్యర్థులు తమ వెంట అడ్మిట్ కార్డుపై పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, మరొక పోస్టుకార్డు సైజ్‌ఫొటోను అతికించాలని అన్నారు. అప్‌డేటెడ్ ఆధార్‌కార్డు, లేటెస్ట్ ఫొటోతో కూడిన ఐడీ ప్రూఫ్‌లను అభ్యర్థులు వెంట తెచ్చుకోవాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు వైకల్యాన్ని ధృవీకరించే సర్టిఫికెట్లను తీసుకురావాలని, పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు పెన్నులు, పెన్సిళ్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తేవద్దన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుందని నీట్ పరీక్షకు సంబంధించి అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం జిల్లాకలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని ఎవరికైనా ఏమైనా సందేహాలు ఉంటే 9912192692, 9885975254 నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

నీట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో స్రవంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ ప్రభాకర్‌కు నీట్ పరీక్ష నిర్వహణపై పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 5వరకు జరగనున్న ఈ పరీక్షకు అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరీక్షాకేంద్రానికి నోడల్ ఆఫీసర్‌ను నియమించామని అభ్యర్థులను పరీక్షా ప్రారంభానికి అరగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని అభ్యర్థులను ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు మాత్రమే అనుమతి ఇనుమతిస్తారని తెలిపారు. అంతకుముందు టీయూలోని సైన్స్ కళాశాలను సందర్శించి వివరాలు సేకరించారు.

భూభారతి అమలుకు పైలెట్ ప్రాజెక్టుగా మెండోరా మండలం ఎంపిక

- ఈనెల 5 నుంచి 15 వరకు రెండు బృందాల ఆధ్వర్యంలో రోజుకు ఒక్కో గ్రామంలో రెవెన్యూ సదస్సులు
- రైతులు, ప్రజల నుంచి భూ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించనున్న రెవెన్యూ అధికారులు

నిజామాబాద్, మే3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో భూభారతి చట్టం క్షేత్రస్థాయిలో అమలయ్యేందుకు పైలెట్ ప్రాజెక్టుగా మెండోరా మండలాన్ని ఎంపిక చేశారు. ఈ మండలంలో భూములకు సంబంధించిన సమస్యలపై రెవెన్యూ అధికారులు అన్నిగ్రామాల పరిధిలో సదస్సులను నిర్వహిస్తారు. రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారు. 15 రోజుల పాటు ఈ మండలం పరిధిలో రెండు రెవెన్యూ బృందాల ఆధ్వర్యంలో ఈ సదస్సులను పూర్తిచేయడంతో రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ మండలం పరిధిలో సదస్సులు నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లను అధికారులు చేశారు.

జిల్లాకు ఒకటి చొప్పున మండలాల ఎంపిక

భూభారతి చట్టం అమలుకు రాష్ట్రప్రభుత్వం మొదట పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో నాలుగు మండలాలను తీసుకుంది. అక్కడ విజయవంతం కావడంతో జిల్లాకు ఒకటి చొప్పున మండలాలను ఎంపికచేసి పైలెట్ ప్రాజెక్టు కింద ఈనెల 5 నుంచి 20 వరకు సదస్సులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో మెండోరా మండలాన్ని పైలెట్‌ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో రెవెన్యూ సదస్సులను ఈ నెల 5 నుంచి 15 వరకు నిర్వహిస్తారు. రైతుల నుంచి భూసంబంధిత సమస్యలపై వినతులను స్వీకరిస్తారు. అనంతరం ఈనెల 31 వరకు పరిష్కరించే విధంగా చర్యలను చేపడుతారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఈ మండలం పరిధిలో రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. మెండోరా తహశీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, కంప్యూటర్ ఆపరేటర్ ఒక బృందంగా, బాల్కొండ తహశీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒక బృందంగా ఈ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు రోజుకు ఒక్కొక్క గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారు. ఈ సదస్సులను ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించడంతో పాటు భూమికి సంబంధించిన సమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఈ సదస్సులను పది రోజుల పాటు నిర్వహిస్తారు. అన్ని గ్రామాలు పూర్తయిన తర్వాత రెవెన్యూ అధికారులు భూసమస్యలపై వచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తారు. ఒకవేళ పరిష్కారం కాకుంటే ఎందుకు కాలేదో ఆ రైతులకు లిఖిత పూర్వకంగా తెలియజేస్తారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములతో పాటు పట్టాలేని వారి భూముల వివరాలను కూడా స్వీకరిస్తారు. కబ్జాలు, అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించడంతో పాటు వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు భూమస్యలను అక్కడికక్కడే పరిష్కరించనున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మెండోరాలో రెవెన్యూ సదస్సుల కోసం అన్ని ఏర్పాట్లను చేసినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. రెండుబృందాలు ప్రతీరోజు ఒక్కో గ్రామంలో సదస్సులను నిర్వహించి రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తారని ఆయన తెలిపారు. ఈనెల 31 లోపు భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.



పేరుకే క్రీడా ప్రాంగణాలు

- క్రీడలకు ఆట స్థలం కరువు
- బోర్డుకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు

...... వివరాలు 3లో

'పది' స్టేట్ టాపర్‌ను అభినందించిన జిల్లా న్యాయాధికారి



క్రితిని అభినందిస్తున్న జిల్లా న్యాయాధికారి

నిజామాబాద్‌అర్బన్, మే3(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో స్టేట్‌లో బెస్ట్ మార్కులు సాధించిన కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థిని ఎస్.క్రితిని శనివారం జిల్లా న్యాయాధికారి జీవీఎన్ భరతలక్ష్మీ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా విద్యార్థిని రాష్ట్రస్థాయి మార్కులు తెచ్చుకొని వారి తల్లిదండ్రులకే కాకుండా జిల్లాకు, రాష్ట్రానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావడం అభినందనీయమని ఇంతటి కృషికి కారకులైన కేవోఎస్ యాజమాన్యాన్ని, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని క్రితి మాట్లాడుతూ కేవోఎస్‌లో ఉన్న ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ ఎంతో చక్కగా, ప్రణాళికబద్ధంగా శిక్షణ ఇవ్వడంతోనే ఎంతటి కఠిన ప్రశ్నలనైనా సులువుగా రాయగలిగానని, అందుకే ఇంతటి మార్కులు సాధించానని చెప్పుకొచ్చింది. కేవోఎస్ డైరెక్టర్ రామోజీరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను గుర్తించేలా విద్యాప్రణాళికలు కేవోఎస్‌లో ఉంటాయని, ఇవన్నీ ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ ద్వారానే సాధ్యమవుతాయని అన్నారు. విద్యార్థిని తండ్రి డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ కేవోఎస్‌లో చేర్పించిన నాటి నుంచి స్కూల్ కారికులం ద్వారా ఎప్పటికప్పుడు వచ్చిన ప్రాబ్లమ్స్ సాల్వ్ చేసుకుంటూ ఉపాధ్యాయులు, డైరెక్టర్లు ఇచ్చిన ప్రణాళికలు తూచాతప్పకుండా పాటిస్తూ తన కూతురు సిద్ధమయ్యేదని అన్నారు. తామిద్దరం డాక్టర్లు కావడంతో పాపతో ఎక్కువ సమయం గడపకపోయిన యాజమాన్యం విద్యా ప్రణాళికలు ఎంతగానో దోహదపడ్డాయని, అందుకే ఇన్ని మార్కులు సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బా స్కర్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన

- ఈనెల 20లోపు వెరిఫికేషన్ పూర్తిచేయనున్న అధికారులు
- జిల్లా, మండల కమిటీ ఆధ్వర్యంలో అర్హుల ఎంపిక
- జూన్ 2న కొంతమందికి చెక్కులు అందించేందుకు ఏర్పాట్లు

నిజామాబాద్, మే3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజీవ్ యువవికాసం పథకంపై నిరుద్యోగులు ఆశలు పెట్టుకోగా అధికారులు జిల్లాలో వెరిఫికేషన్ ప్రక్రియను మొదలుపెట్టారు. మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. అన్ని గ్రామాలు, వార్డుల పరిధిలో బృందాల వారిగా పర్యటిస్తూ దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తున్నారు. దరఖాస్తులో వచ్చిన అన్ని వివరాలను పరిశీలించడం మీదట వివరాలను నమోదు చేసుకుంటున్నారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీ వార్డుల్లో ఈనెల 20లోపు వెరిఫికేషన్ పూర్తి చేసి అర్హులైన వారిని ఎంపిక చేయనున్నారు. వీరికి జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అనుమతులను మంజూరు చేయడంతోపాటు సబ్సిడీ గ్రాంట్‌ను అందించనున్నారు. జిల్లాలోని మండలాల పరిధిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతుండగా మున్సిపాలిటీల పరిధిలో కమీనర్ల ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుంది. ప్రతీరోజు నిర్ణీత దరఖాస్తులను పరిశీలించి వివరాలను నమోదుచేస్తూ త్వరగా వెరిఫికేషన్ పూర్తిచేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. అవసరమైనచోట ఎక్కువ బృందాలను నియమించి వెరిఫికేషన్ త్వరగా పూర్తయ్యేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు.

భారీగా దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకం కోసం జిల్లాలో భారీగా దరఖాస్తులు చేశారు. స్వయం ఉపాధి కింద ఈ దరఖాస్తులను ఎక్కువమంది నిరుద్యోగ యువతచేశారు. జిల్లాలో అన్నికలిపి 58వేల 632 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎస్సీ వర్గం నుంచి 10,826, ఎస్టీ 4,590, బీసీ 29,383, ఈబీసీ 1327, మైనార్టీ 12,253, క్రిస్టియన్ 253 మంది దరఖాస్తులను చేసుకున్నారు. ఈ దరఖాస్తులు గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో రావడంతో వాటన్నింటిని ప్రస్తుతం వెరిఫికేషన్ చేస్తున్నారు. ఈ పథకం కింద ప్రభుత్వం 4లక్షల వరకు రుణాలు అందించనుంది. వీటిలో చిన్నపాటి రుణాలకు పూర్తిస్థాయి సబ్సిడీ కింద ఇవ్వనుండగా రుణం పెరిగిన కొద్దీ సబ్సిడీని తగ్గించి ఇవ్వనున్నారు. జిల్లావ్యాప్తంగా ఎక్కువ మంది దరఖాస్తులు చేయడంతో మండలాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో ఈ వెరిఫికేషన్ కొనసాగుతోంది. మున్సిపాలిటీల పరిధిలో కమీషనర్ల ఆధ్వర్యంలో వార్డులు, డివిజన్‌ల పరిధిలో కొనసాగుతోంది. ఈనెల 20లోపు సర్వే పూర్తి చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ఎక్కువ మొత్తంలో ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బృందాలను నియమించి ఈ సర్వేను కొనసాగిస్తున్నారు. స్వయం ఉపాధి కింద రవాణా, వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు పారిశ్రామిక సంబంధిత చిన్న యూనిట్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించనున్నారు.

స్వయం ఉపాధి వైపు మళ్లించేలా..

ప్రభుత్వం యువతను స్వయం ఉపాధి వైపు మళ్లించేందుకు, ప్రోత్సహించేందుకు ఈ రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. అన్నివర్గాల నుంచి ఈ పథకం కోసం జిల్లాలో ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటిని పకడ్బందీగా పరిశీలించాలని ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు అన్ని వివరాలను తీసుకుంటున్నారు. ఈ పథకానికి గ్రామీణ ప్రాంతంలో సంవత్సరానికి లక్షన్నరలోపు ఆదాయం ఉన్న వారికే అర్హత ఉంది. పట్టణ ప్రాంతంలో 2లక్షల లోపు ఆదాయం ఉండాలని నిబంధనలు పెట్టారు. ఆ నిబంధనల ప్రకారమే దరఖాస్తులన్నీ పరిశీలిస్తున్నారు. ఈ పథకం కింద అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు పూర్తిస్థాయిలో వెరిఫికేషన్‌ను అధికారులు చేస్తున్నారు. ఈ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత మండల స్థాయిలో ఎంపీడీవో ఆధ్వర్యంలోని కమిటీలు అర్హులైన వారిని ఎంపిక చేస్తారు. ఆ జాబితాను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీకి పంపిస్తారు. ఆ కమిటీ జాబితాను పరిశీలించి తుది జాబితాను ప్రభుత్వానికి పంపిస్తారు. ఆయా శాఖల అధికారులు పరిశీలించి ఎంపిక జాబితాను ఓకే చేయగానే జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో వారికి పత్రాలను అందజేస్తారు. స్వయం ఉపాధి కింద సబ్సిడీ చెక్కులను అందిస్తారు. దానికి అనుగుణంగానే యూనిట్లను ఏర్పాట్లు చేసుకునే విధంగా ప్రోత్సాహాన్ని అందిస్తారు. జిల్లాలో వచ్చిన దరఖాస్తులను ప్రస్తుతం వెరిఫికేషన్ చేస్తున్నామని అధికారులు తెలిపారు. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత అర్హులైన వారిని ఎంపిక చేస్తామని వారు తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశుసంర్ధక శాఖ అధికారి రోహిత్‌రెడ్డి

డొంకేశ్వర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో పశుసంవర్ధక శాఖ అధికారి రోహిత్ రెడ్డి శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. పశువుల నోరు కాలి గిట్టల మధ్య పుండ్లు రావడం, జ్వరం ఉండటం గాలికుంటు వ్యాధి లక్షణాలన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులలో పాల ఉత్పత్తి తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీకాంత్, సిబ్బంది ధర్మాజీ నర్సయ్య, గ్రామస్థులు గణేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని చింతలూర్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. శనివారం చింతలూర్‌లో 360 పశువులకు, 15 ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణి హర్షిత తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాక్లూర్ : మండలంలోని లక్మాపూర్ గ్రామంలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిరణ్ దేశ్‌పాండే తెలిపారు. పాడి రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వినిత, కళ్యాణి, షైమద్‌పాషా, శ్యామలతో పాటు రైతులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత



ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న దృశ్యం

భీమ్‌గల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని వీధి వ్యాపారులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అజయ్ పవర్ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఎండ వేడిమి ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నట్లు డాక్టర్ తెలిపారు. వేడి పెరుగుతున్న క్రమంలో వడదెబ్బలు తగిలే ప్రమాదం ఉందని వీధి వ్యాపారస్తులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

ఆర్మూర్ టౌన్, మే 03(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగచారినగర్‌లో ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి చెందిన యువతి వివాహానికి కొంతమేర ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. అలాగే కమలానెహ్రూ కాలనీలో నివాసముంటున్న తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరిపిల్లలకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్య క్రమంలో ఈఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈరవత్రి రాజశేఖర్, కాంగ్రెస్ నాయకుడు ఎస్‌కే.బబ్లూ, సయ్యద్ యూసుఫ్, షేక్‌పాషా, ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, సదాక్ ప్రమోద్, రాంప్రసాద్, కొండ రామ్‌చందర్, సురేందర్, శ్రీకాంత్‌గౌడ్, కిషన్, ఇస్తకోషైమద్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పరిశీలన



ఇందిరమ్మ ఇండ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో బ్రహ్మానందం

డొంకేశ్వర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దత్తాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారుల ఇండ్ల స్థలాలను ఎంపీడీవో బ్రహ్మానందం శనివారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇండ్లు నిర్మించుకోవడానికి స్థలం ఉందా అని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులకు వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. ఇండ్ల స్థలాలను పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఆయన వెంట కార్యదర్శి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రేపటి నుంచి సదస్సులు

కోటగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో రైతులకు పంట సాగుపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు రుద్రూర్ కేవీకే కో-ఆర్డినేటర్ అంజయ్య తెలిపారు. సోమవారం నుంచి జూన్ 13వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు కొనసాగుతాయన్నారు. తక్కువ యూరియా వాడకం, సాగుఖర్చు తగ్గించడం, అవసరం మేరకు రసాయనాలు వినియోగించడం, నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, రసీదులను భద్రపర్చడం, కష్టకాలంలో నష్టపరిహారం పొందడం, సాగునీటిని ఆదా చేయడం, పంట మార్పిడి చేయడం, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడడం వంటి అంశాలపై అవగాహన సదస్సు కొనసాగుతుందన్నారు. పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు తగిన సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. అవగాహన సదస్సులను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాల వితరణ

బోధన్‌రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని హున్సా ప్రాథమిక పాఠశాలలో తరుచు దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన చాంద్ పాషా అనే వ్యక్తి తన సొంత నిధులతో నాలుగు సీసీ కెమెరాలను శనివారం ఏర్పాటు చేశారు. ఇటీవల హున్స గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు సెలవు దినాల్లో దొంగలించడానికి రావడం తనను కలిచివేసిందని, సరస్వతి నిలయంగా ఉండే పాఠశాలలో దొంగతనం నివారణకు తనవంతు సహాయంగా నాలుగు సీసీ కెమెరాలను తన సొంత నిధులతో ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్థులు గ్రామ పెద్దలు, గ్రామస్థులు, ఉపాధ్యాయ బృందం చాంద్‌పాషాను అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

● బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో



వివరాలను అడిగి తెలుసుకుంటున్న బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

ఎడపల్లి, మే3(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం ఎడపల్లి మండంలోని అంబం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇంటికి బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో నేరుగా వెళ్లి లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారణ పనులను వేగవంతం చేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీ ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను పంచాయతీ, మండల అధికారులు ఇంటింటికీ వెళ్లి ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎడపల్లి ఎంపీడీఓ శంకర్, గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

నవీపేట : మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల వివరాలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తుది జాబితాకు సంబంధించిన వివరాలను ఎంపీవో రామకృష్ణ క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్దిదారుల నుంచి వివరాలు సేకరించారు. మండలంలోని గాంధీనగర్, పొతంగల్, అభంగపట్నం, అనంతగిరిలలో ఆయన వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులున్నారు.



గాంధీనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల వివరాలను సేకరిస్తున్న ఎంపీవో రామకృష్ణ

రైలు ఢీకొని 10 గేదెల మృతి



రైలు ఢీకొని మృతిచెందిన గేదె

నవీపేట,మే3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అభంగపట్నం శివారులో శనివారం సాయంత్రం రైలు ఢీకొని 10గేదెలు మృతిచెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజులాగానే గ్రామానికి చెందిన పలు గేదెల మంద ఉదయం గ్రామ శివారులో మేతకు వెళ్లాయి. సాయంత్రం గేదెల మంద ఇంటికి వచ్చే సమయంలో మందల్లోంచి కొన్ని గేదెలు రైలు పట్టాలు దాటే ప్రయత్నం చేశాయి. ఇదే సమయంలో బాసర నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు పట్టాలు దాటుతున్న గేదెలను ఢీకొనడంతో 10 గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఆర్‌పీఎఫ్ సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో సుమారు 6లక్షల వరకు నష్టం జరిగిందని స్థానికులు, బాధితులు పేర్కొన్నారు.

ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

వేల్పూర్, మే 3(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం మోతె గ్రామ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గ్రామాభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల గ్రామాభివృద్ధి కమిటీ హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను శాలువ, మెమెంటోతో సత్కరించారు. వేల్పూర్ మండలంలో టాపర్‌గా నిలిచిన తమ పాఠశాల విద్యార్థులు ఎస్. శ్రీనిధిని గ్రామాభివృద్ధి కమిటి, పాఠశాల విద్యా కమిటీ, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా సన్మానించారు. గ్రామ వీడీసీ స్పీకర్స్ జగదీశ్‌రెడ్డి, సాయిరాం, అకౌంటెంట్ మహేష్‌రెడ్డిలు మాట్లాడుతూ మోతె పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి అందులో 50 శాతం విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించడం గ్రామానికి గర్వకారణమని అన్నారు. వరుసగా రెండోసారి మండలంలో టాపర్‌గా తమ గ్రామ పాఠశాల విద్యార్థులు టాపర్లుగా నిలవడం అనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వైద్య గణేష్, పీఆర్‌టీయూ మండ కార్యదర్శి సీవీ నర్సింహారావు, ఉపాధ్యాయులు మహేందర్, రత్నయ్య, లలితమ్మ, విడిసి సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండంలోని కోనాసముందర్ వడ్డర కాలనివాసులు త్రాగునీటి అవసరాల నిమిత్తం బోర్ మంజూరి కాగా శనివారం బోర్‌డ్రిల్లింగ్ పనులను కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి డైరెక్టర్ జైడి మధులతశ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. కాలనీలో నీటి ఎద్దడి నివారణ నిమిత్తం బాల్కొండ నియోజికవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ బోర్ మంజూరి చేసినట్లు తెలిపారు. కాలనివాసుల పక్షణ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జైడి శ్రీనివాస్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అమీర్‌నగర్‌లో మహిళ ఆత్మహత్య

కమ్మర్‌పల్లి, మే 3 : (ఆంధ్రజ్యోతి) మండలంలోని అమీర్‌గన్ గ్రామానికి చెందిన బోదాసులక్ష్మీ (50) అనే మహిళ శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మారణానికి పాల్పడినట్లు కమ్మర్‌పల్లి ఎస్ ఐ అనీల్ రెడ్డి తెలిపారు. గత కొంత కాలంగా అనారోగ్యాంతో బాధపడుతున్న లక్ష్మీ మనస్తాపానికి గురై ఉరివేసుకుని అత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి కొడుకు బోదాసు గంగాధర్ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలం చేరుకుని శవ పంచనామా అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ఇంటర్‌బోర్డు ప్రత్యేకాధికారి తనిఖీ



అధ్యాపకులతో మాట్లాడుతున్న ఇంటర్‌బోర్డు ప్రత్యేకాధికారి

ఆర్మూర్ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల జరిగిన పరీక్షల్లో ఫేయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను శనివారం రాష్ట్ర ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారి ఒడ్డెన్న జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్, అకాడమిక్ సెల్ ఆర్గనై జర్ నర్సయ్య తనిఖీ చేశారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాలలో ఫేయిల్ అయిన విద్యార్థులకు 15 రోజులకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి విద్యార్థులందరు ఉత్తీర్ణులయ్యే విధంగా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఒక్క సబ్జెక్టు, రెండు సబ్జెక్టులలో ఫేయిల్ అయిన వారికి ప్రత్యేకంగా వారి తల్లిదండ్రులను కలిసి ఇంటివద్దనే చదివించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయానంద్‌రెడ్డి, అధ్యాపకులు రవి, చంద్రశేఖర్, నరేష్, చంద్ర మోహన్, సుభాష్, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

నవీపేట,మే3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫకీరాబాద్ శివారులో శనివారం రాత్రి లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. బాసర నుండి ఫకీరాబాద్ వైపు బైక్ వస్తుండగా నిజామాబాద్ నుండి బాసర వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొందని అన్నారు. ఈ ప్రమాదంలో తాడ్‌బిలోలికి చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అతనిని 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

హెల్మెట్ల పంపిణీ

ఆర్మూర్‌రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణానికి చెందిన సామాజిక సేవకులు పట్వారి తులసికుమార్ శనివారం జాతీయ రహదారిపై వెళ్తున్న ద్విచక్రవాహనదారులకు ఉచితంగా హెల్మెట్‌లను పంపిణీ చేశారు. వాహనదారులకు హెల్మెట్ వాడకం పై అవగాహన కల్పించి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. హెల్మెట్ వాహనదారులకు రక్షణగా ఉండడమే కాకుండా కుటుంబానికి రక్షణను ఇస్తుందన్నారు. వాహనదారులు అతివేగంతో బైక్‌లను నడపవద్దని, రోడ్డు నిబంధనలు పాటించి ప్రతీఒక్కరు సురక్షితంగా ఇంటికి చేరుకోవాలన్నారు.

'ఉపాధిహామీ పథకం అమలుకు కేంద్ర బడ్జెట్‌లో కోతలు'



సమావేశంలో మాట్లాడుతున్న రైతు కూలీసంఘం జిల్లా అధ్యక్షులు

కమ్మర్‌పల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) నిరుపేద కుటుంబాలకు బాసటగా నిలుస్తు వస్తున్న మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగార్చాలని చూస్తునదని అఖిలభారత ఐక్య రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు సారా సురేష్ ఆరోపించారు. శనివారం కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామశివారులో కొనసాగుతున్న ఉపాధిహామీపథకం కూలీలవద్దకు వెళ్లి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎర్రజెండా పార్టీ నాయకత్వంలో అనేక పోరాటాల ద్వార సాధించుకున్న ఉపా దిహామీ పథకం చట్టాన్ని బీజేపీ నరేంద్ర మోదీ ప్రభుత్వం బడ్జెట్‌లో కోతలు విధిస్తు నీరుగార్చే విధంగా విధానాలు అవలంబిస్తున్నాయని అన్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తున్నా రోజువారి కూలీ 150 రుపాయలు దాటడంలేదని అన్నారు. ప్రభుత్వ నిబంధనలవల్ల కూలీ లు కనీసవసతులకు దూరమవుతున్నారని, కొలతల విదానాన్ని రద్దు చేస్తు రోజువారి కూలీ 6 వందలు వచ్చేవిదంగా చూడాలని, కూలీలందరికి వారం వారం కూలీడబ్బులు అందేలా గత చర్యలు తీసుకోవాలని, ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు కనీసవేతనాలు 20 వేలు ఇవ్వాలని కూలీలకు రవాణ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిధులు మంజూరు చేయించాలని వీడీసీ వినతి

నందిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డికి వీడీసీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానిం చారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన డబుల్ రోడ్డుకు సెంట్రల్ లైటింగ్ ఏర్పా టు, కుంటకట్టలో ఉన్న స్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మాణం, వీదుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు నిధులు ఇప్పించాలని కోరారు. అం తే కాకుండా మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల, ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు దమ్మా యి సుధాకర్, సంబారు నారాయణ, మంద మహిపాల్, మచ్చర్ల సాగర్, మచ్చర్ల నడ్పి సాయన్న, మంతెన శ్రీనివాస్, నాగుల అశోక్, ఏర్రం సాగర్, ఏశాల చిన్నయ్య ఉన్నారు.



పొద్దుటూరి వినయ్ రెడ్డిని సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు



బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

వర్ని ఎంపీడీవోగా మారుతి

వర్ని, మే 3 (ఆంధ్రజ్యోతి): వర్ని ఎంపీడీవోగా మారుతి శనివారం బాధ్యతలు చేపట్టారు. గత ఎంపీడీవో విధులకు సెలవు పెట్టడంతో జిల్లా అధికారులు మారుతికి ఈ బాధ్యతలు అప్పజెప్పారు. మండలంలో అభివృద్ధి కోసం అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

'చిరుత జాడ తెలియలేదు'

ఆర్మూర్‌టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): సిద్దుల గుట్టపై ఇంకా చిరుత పులి జాడ తెలియలేదని డిప్యూటీ రేంజ్ అధికారి ఆఫీసర్ ఆర్. శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో చిరుతపులి జాడ తెల్సినట్లు వస్తున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోలు ప్రజలు నమ్మవద్దని ఆమె తెలిపారు. సిద్దుల గుట్టపై చిరుతపులి జాడకోసం ఏర్పాటు చేసిన ట్రాకింగ్ కెమెరాల్లో ఎలాంటి సమాచారం రాలేదని, ఫేక్‌వీడియోలను నమ్మవద్దని ఆమె ప్రజలను కోరారు.

చిట్టాపూర్‌లో బడిబాట



చిట్టాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బాల్కొండ, మే 3(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని, విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు పాఠశాలలో చదివిన విద్యార్థుల ప్రగతిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేర్ల శ్రీనివాస్, రామస్వామి, విజయకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టు ప్రదక్షణ చేయించారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బోధన్ రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్, మే3 (ఆంధ్రజ్యోతి): బోధన్ రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించడంతో రైల్వే పోలీసులు నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయసు 25 నుండి 30సంవత్సరాలు ఉంటుంది. తాపీమేస్త్రీ కూలీ పనులు చేసుకునే వ్యక్తిగా పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహన్ని ఎవరైనా గుర్తు పట్టినచో రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కోటగిరి, మే3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా అటు విద్యుత్ సిబ్బంది, ఇటు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో డీఈ మహ్మద్ ముక్త్యార్ సూచించారు. రుద్రూరు మండలకేంద్రంలో శనివారం విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు, మూగజీవాలకు విద్యుత్ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోకుండా జీరో ప్రమాదాల కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ నగేష్ కుమార్; ఏఈలు శ్రీనివాస్, బుజ్జిబాబు, గోపి, ఫక్రోద్దీన్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన శ్రీనివాస్

జక్రాన్‌పల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన తలవాణి శ్రీనివాస్ అదృశ్యమైనట్లు ఎస్సై మాలిక్‌రహ్మాన్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌కు తమ స్నేహితుడు శివతో కలిసి స్కూటిపై వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లారని ఇప్పటి వరకు ఇంటికి తిరిగిరాలేదని తెలిపారు. అతడి తల్లి తలవాణి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి



బోల్తాపడి మృతిచెందిన రాజ్‌కుమార్

బాల్కొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం బోదపల్లి గ్రామానికి చెందిన గోరుమంతుల రాజ్‌కుమార్ (32) శనివారం ట్రాక్టర్ బోల్తాపడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మధ్యాహ్నం బోదపల్లి శివారులోని ఎస్సారెస్పీ వరద కాలువ వద్దనుంచి కట్టెలు తేవడానికి ట్రాక్టర్‌పై వెళ్లగా మార్గమధ్యంలో డీ3 లక్ష్మకెనాల్ వెంబడి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి కాలువలో పడడంతో రాజ్‌కుమార్ అక్కడిక్కడే మృతిచెందాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ విఠల్ తెలిపారు.

పలు బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

ముప్కాల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏలేటి గంగాదర్ కుటుంబాన్ని శనివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల ఏలేటి గంగాధర్ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు వారి కుటుంబాన్ని పరామర్శించారు. వేంపల్లి గ్రామానికి చెందిన నార్ల భూమన్న మృతిచెందడంతో వారి కుటుంబాన్ని ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫటా.. ఫట్...

వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలి

● బిచ్కుంద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగడం నరేష్



ఆంధ్రజ్యోతి : జుక్కల్ మండల కేంద్రం మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దులో ఉండటంతో ప్రజలకు ఎలా భద్రత కల్పిస్తున్నారు?

అధికారి : జుక్కల్ మండల ప్రజలకు వారికి జుక్కల్ పోలీసులు ఎల్లప్పుడూ భద్రత కల్పించడానికి సిద్ధంగా ఉన్నాం. రాత్రి సమయంలో పెట్రోలింగ్ వాహనం మండల కేంద్రంలో ఎప్పుడు గస్తీ తిరుగుతూ ఉంటుంది. కాని స్టేబుల్ టు వీలర్ బైక్‌పై సరిహద్దు గ్రామాల ప్రజల భద్రత కల్పించడానికి ప్రత్యేక నిఘ ఏర్పాట్లు చేశాం.

ఆంధ్రజ్యోతి : వేసవి కాలంలో ఇతర రాష్ట్రాల దొంగలు వచ్చే అవకాశం ఉంది. దీనిపై ప్రణాళిక రూపొందించారా?

అధికారి : వేసవి కాలంలో ఇతర రాష్ట్రాల నుంచి దొంగతనాలు జరగకుండా పోలీసు శాఖ తరఫున ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. గ్రామాలలో కొత్త వ్యక్తులు సంచరిస్తే వంద డయల్‌కు ఫోన్ చేస్తే క్షణంలో పోలీసులు, పోలీసు సిబ్బంది వస్తారు. అదే విధంగా కుటుంబ సభ్యులు వేరే గ్రామాలకు వెళితే ఇంటికి తాళం వేసినచో పోలీసులకు తెలిపి వెళ్లాలి. ఒక ప్రత్యేకంగా పెట్రోలింగ్ సమయంలో అటువంటి ఇళ్ళకు నిఘా ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా పోలీసు సిబ్బంది కాపాడుతుంది. రైతు కుటుంబం యజమానులు, పశువుల కాపలాగా బయట నిద్రించాలి. కుటుంబ సభ్యులు ఇంట్లోనే నిద్రించాలి. దొంగత నాలు నివారించుటకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.

ఆంధ్రజ్యోతి : గ్రామీణ ప్రాంతాలలో మూఢ నమ్మకాలపై అనుమానం పెంచుకుని ఘర్షణలు జరుగుతున్నాయి. దీనిపై మీరు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి : గ్రామీణ ప్రాంతాల్లో మూఢ నమ్మఆలపై పోలీస్ శాఖ తరఫున ఇటీవల కట్టాలి. గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశాం. ప్రజలు అనారోగ్యానికి గురైతే వైద్యులను సంప్రదించాలి. కాని మంత్రాలతో అనారోగ్యానికి గురైనట్లు ప్రజలు భావించవద్దని ఆయన సూచించారు.

ఆంధ్రజ్యోతి : యువకులు జూదం, మద్యం బానిసలై చెడు మార్గం వైపు వెళుతున్నారు. దీనిపై ఎలా స్పందిస్తారు?

అధికారి : గ్రామాలలో యువకులు జూదం ఆడినట్లయితే పోలీసు శాఖ వారికి సమాచారం ఇచ్చినచో పట్టుకుని కేసు నమోదు చేస్తాం. అదే విధంగా యువకులు అతిగా మద్యం తాగి ప్రమాదం బారిన పడుతున్నారు. ప్రతీ యువ కుడు ఆలోచించి మద్యం తాగడం మానేసి కుటుంబ సభ్యులను గౌరవించాలని ఆయన సూచించారు.

● (జుక్కల్, ఆంధ్రజ్యోతి)

పేరుకే క్రీడా ప్రాంగణాలు

● ఆట స్థలాలు లేక విద్యార్థులకు అసౌకర్యం ● బోర్డుకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు

ఆర్మూర్ రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలోని వివిధ గ్రామాలలో క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు వారు ఆటలు ఆడుకోవడానికి అప్పటి ప్రభుత్వం క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసింది. సరైన దూరదృష్టి లేకుండా కేవలం ప్రచారం కోసమే ఆర్భటంగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి ఒక బోర్డు తగిలేసి చేతులు దులుపుకున్నారు. క్రీడాకారులు సాధన చేయడానికి అనువైన మైదానం ఉన్నప్పుడే వారికి క్రీడాల్లో నైపుణ్యం సాధించేందుకు అవకాశం ఉటుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి మండలంలో గ్రామ గ్రామాన క్రీడాప్రాంగాణాలను ఏర్పాటు చేసింది. వాస్తవానికి ఆ క్రీడా ప్రాంగణాలలో ఏనాడు ఏ క్రీడలు ఆటలు ఆడింది లేదు సాధన చేసింది లేదు. కొంతమేర ప్రభుత్వ భూమి ఉంటే అందులో ఒక బోర్డు తెలంగాణ క్రీడా ప్రాంగణమని ఏర్పాటు చేసి మమ అనిపించారు. ఆ స్థలంలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి వనంలా తయారైనప్పటికి అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకున్న దాకలాలు లేవు. అనేక గ్రామాలలో విద్యార్థులు, యువకులకు ఆటలుఆడే ఆసక్తి ఉన్నప్పటికి సరైన మైదానాలు లేక వారు టీవీలకు, ఫోన్‌లకు అంకితమవుతున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగాణంలో ఎలాంటి వసతులు లేవు. కేవలం ఆర్భటంగా ప్రారంభించిన ఈ క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమై ఉత్సవ విగ్రహాలుగా నిలిచిపోయాయి. చాలా గ్రామాలలో క్రీడా ప్రాంగాణాలు గ్రామానికి దూరంగా ఉండడం, ఆటస్థలం అనుకూలంగా లేకపోవడంతో విద్యార్థులకు అసౌకర్యంగా మారింది.

క్రీడలకు ప్రసిద్ధి ఆర్మూర్ ప్రాంతం..

ఆర్మూర్ ప్రాంతం కొన్ని దశాబ్ధాల నుంచి క్రీడలకు ప్రసిద్ది చెందింది. హాకీలో రాష్ట్రంలోనే జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలుస్తుంది. ఇందులో ఆర్మూర్ ప్రాంత క్రీడాకారులు జట్టులో ఎక్కువ ప్రాతినిధ్యం వహిస్తుంటారు. పలుమార్లు రాష్ట్ర ,జాతీయ స్థాయి హాకీ పోటీలను నిర్వహించారు. ఇక్కడి క్రీడాకారులు జాతీయ స్థాయిలో సైతం రాణించారు. పట్టణంలో మినిస్టేడియం బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాలు క్రీడాకారుల సాధనకు అనువుగా ఉన్నాయి. గ్రామాలలో, మండల కేంద్రాలలో సరైన వసతులు లేకపోవడం భవిష్యత్ క్రీడాకారులకు అసౌకర్యంగా మారింది. క్రీడా ప్రాంగణాలలో మైదానాలు చదును చేసి శుభ్రంగా తయారు చేస్తే విద్యార్థులు ఆటలు ఆడే అవకాశం ఉంటుంది. వేసవిలో పాఠశాల, కళాశాల విద్యార్థులు సుమారు రెండు నెలల పాటు గ్రామాలలోనే ఉంటారు. వారికి ఆటలాడడానికి క్రీడల్లో నైపుణ్యాలు మెరుగుపర్చుకోవడానికి సరైన వసతులు లేవు.

అధ్వానంగా తయారైన క్రీడా ప్రాంగణాలు ..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు, ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగి వనంలా తయారయ్యాయి. క్రీడలను ప్రోత్సహించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. దీంతో క్రీడాకారులకు ఆటలు ఆడటానికి సరైన మైదానం లేక ఆటలకు దూరంగా ఉండాల్సి వస్తుంది. క్రీడామైదానాలు బాగుచేయించి విద్యార్థులకు,



ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో క్రీడా ప్రాంగణం

పిల్లలకు సాధన చేయడానికి అవకాశం ఉంటే క్రీడల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించేందుకు వీలుంటుంది. క్రీడలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నా నాయకులకు క్రీడ ప్రాంగణాలలో ఉన్న అసౌకర్యం కన్పించకపోవడం విడ్డూరంగా ఉంది. అన్ని సౌకర్యాలను కల్పించి విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో శిక్షణ ఇచ్చి పోత్సహిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చూపి పతకాలు సాధించే అవకాశం ఉంటుంది.

అధికారులు, నాయకులు చొరవ చూపాలి..

గ్రామాల్లో ఉపయోగంలో లేని క్రీడా ప్రాంగణాలను వాడుకలోకి తీసుకువచ్చేందుకు అధికారులు, నాయకులు చొరవ చూపాలి. ఇంగ్లీష్‌మీడియం, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సరైన ఆటస్థలాలు లేక ఆటలకు దూరం అవుతున్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శరీర సౌష్టవం పెరగడమే కాకుండా క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు చదువుల్లో కూడా చురుకుగా ఉంటారన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలి. ప్రభుత్వం ఇకనైన స్పందించి క్రీడా ప్రాంగణాలను బాగుచేయించి విద్యార్థులకు ఆడుకోవడానికి ఆట స్థలాలను అందుబాటులోకి తీసుకురావాలి. క్రీడాకారులకు ఆటలాడడానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తే వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు కరువు

● అద్దె భవనాల్లో విధుల నిర్వహణ ● నిర్మాణంలో పలు పంచాయతీ భవనాలు

మద్నూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులకు అందుబాటులో ఉండే గ్రామ పంచాయతీ భవనాలు ఇరుకు గదులు, అద్దె భవనాల్లో కొన సాగుతున్నాయి. ఉమ్మడి మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఫలితంగా పంచాయితీ నిర్వహణకు సంబంధించిన కార్యకలాపాలు అన్ని అద్దె భవనాలు, రేకుల షెడ్డుల్లో నడిపిస్తున్నారు. ఏళ్ల గడుస్తున్నా నిర్మాణంలో ఉన్న కొన్ని గ్రామ పంచాయతీలు పూర్తి కాలేదు. మరికొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. ఉమ్మడి మద్నూర్ మండలంలో 34 గ్రామ పంచా యతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీకి సొంత భవనం ఉం డాల్సి ఉండగా 12 పంచాయతీలకు సొంత భవనాలు లేవు. డోంగ్లి మండలంలో ఇలేగావ్, హసన్ టాక్లీ, మారేపల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాలు నిర్మాణం చివరి దశలో ఉన్నాయి. మరికొన్ని పంచాయతీలకు పాత భవనాల్లోనే నడిపిస్తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలోని సిరిపూర్ మాజీ ఎంపీ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం రేకుల షెడ్డులోనే కొనసాగుతుంది. మద్నూర్ మండల కేం ద్రంలో సైతం గ్రామ పంచాయతీకి సొంత భవనం లేకపోవడం వి డ్డూరం. ప్రస్తుతానికి ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఆయా గ్రా మాలకు గ్రామ పంచాయతీ భవనాలను మంజూరు చేశారు. వాటి లో మూడు గ్రామ పంచాయతీలకు మాత్రమే ప్రోగ్రెస్‌లో ఉండగా సిర్పూర్, అంతాపూర్, చిన్న ఎక్లారా, చిన్న తడుగూర్, మద్నూర్, రాచూర్, సోమూర్, లింబూర్, మల్లాపూర్ గ్రామాలకు నిధులు మంజూ రైన ఇప్పటి వరకు గ్రౌండ్ కాకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత భవనాలు లేక పోవడంతో అద్దె భవనాలు అంతంత మాత్రం గానే ఉండటం వల్ల పంచాయతీకి సంబంధించిన విలువైన రికార్డులను ఎక్కడ భద్రపరుస్తారోనని ప్రజల్లో సందేహం వ్యక్తం అవుతుంది. పంచాయతీ సమావేశాలను కూడా ఆయా గ్రా మ పంచాయతీలలో నిర్వహించటానికి స్థలం కూడా సక్రమంగా లేదు. పంచాయతీ కార్యదర్శులు అదెద భవనాల్లో విధులు నిర్వహించడం కష్టంగా ఉంది.


రేకుల షెడ్డులో సిర్పూర్ గ్రామ పంచాయతీ

అయినప్పటికీ బయటకు మాత్రం చెప్పలేక పోతున్నారు. హసన్ టాక్లీ గ్రామ పంచాయతీ పాఠశాల భవనంలోనే కొనసాగుతుంది. ఉన్న పంచాయతీ భవనాల్లోనే విధులు నిర్వహిస్తూ వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉన్నత అధికారులు సొంత భవనాలు లేని పంచాయతీలను పరిశీలించి కొత్త భవనాలు మంజూరు కావడంతో నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● మంజూరైన గ్రామ పంచాయతీ పనులు ప్రారంభిస్తాం

ఉమ్మడి మద్నూర్ మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద మంజూరైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మూడు గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం పనులు పూర్తి కావచ్చాయి. మిగతా తొమ్మిది గ్రామ పంచాయతీ భవనాలు పనులు త్వరగా ప్రారంభమయ్యే విధంగా చూస్తాం.

- వెంకట నర్సయ్య, ఎంపీవో


మౌలాలి తండాలో తాళం వేసి ఉన్న పంచాయతీ కార్యాలయం

పల్లెల్లో కానరాని

ప్రత్యేక అధికారులు

● మొక్కుబడిగా స్వచ్ఛదనం, పచ్చదనం ప్రణాళిక పనులు

● కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్ చేస్తున్న అధికారులు

రెంజల్, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పల్లెలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం ప్రణాళిక పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. గ్రామంలోని అధికారులు ప్రజాప్రతినిధులు అందరు సమన్వయంతో కలిసి గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో రూపొందించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం విజయవంతం కావాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి కాని ప్రణాళికను అమలు చేయడంతో అధికారుల నిర్లక్ష్యంతో ప్రణాళికా పనుల్లో ఆలసత్వం వహిస్తున్నారు. ప్రతి గ్రామానికి ఒక్కో ప్రత్యేక అధికారుల జాడ కానరావడం లేదు. మొక్కుబడిగా అలా వచ్చి ఇలా వెళ్లడంతో గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించడంలో అధికారులు విఫలమవుతున్నారు. రెంజల్ మండలంలోని పలు గ్రామాలలో ప్రత్యేక అధికారుల జాడ కానరావడం లేదు. ఉదయం పల్లెల్లో ఉండాల్సిన ప్రత్యేక అధికారులు మధ్యాహ్నం 12వరకు కూడా గ్రామాల్లో పర్యటించిన దాఖలాలు లేవు. అలా వచ్చి ఇలా మొక్కుబడిగా వెళ్లడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. అధికారుల పనితీరు మారకుంటే వేటు తప్పదని పై అధికారులు హెచ్చరించిన కూడా పనితీరులో మార్పు రావడం లేదు.



బోర్గాంలో తాళం వేసి ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయం

తగ్గుతున్న భూసారం

● పెరిగిన రసాయన ఎరువుల వాడకం..

● వేసవి దుక్కులు, పచ్చి రొట్ట ఎరువుతో ప్రయోజనం

మద్నూర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : గత కాలంలో ప్రతి రైతు పశువులను పెంచేవారు. ఏడాదంతా నిలువ చేసిన పశువుల పెంటను వేసవిలో ఎడ్ల బండ్లతో భూముల్లో, చేన్ల ల్లో పోసేవారు. చెరువు కుంటల్లో నుంచి నల్లమట్టి తీసుకెళ్లిపోసేవారు. అప్పుడు రసాయన ఎరువుల వాడకం ఉండేది కాదు. ఎవరైనా వాడిన ఎకరాకు ఒక బస్తా ఎరువు వేసే వారు. దీంతో పంట దిగుబడులు బాగా ఉండేవి. అలా పండించిన పంటలు తిని మనుషులు కూడా ఆరోగ్యంగా ఉండేవారు. ఇప్పుడు ఆ వ్యవసాయం వెతికినా కనిపించడం లేదు. సేంద్రీయ గో ఆధారిత వ్యవసాయం చేయాలని శాస్త్రవేత్తలు ప్రకృతి పరిరక్షకులు అవగాహన సదస్సులు నిర్వహించే చెబుతున్న రైతులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. దీంతో నానాటికి భూసారం తగ్గి పంట దిగుబడులు కూడా తగ్గి రైతులు ఆర్థికంగా చితికి పోతున్నారు. భూసారం పెంచడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు సూచనలు చేస్తున్నారు.


వేసవిలో ఇలా దక్కులు చేయాలి

● వేసవి దుక్కులతో మేలు..

వానాకాలంలో సాగుకు ముందు 15 నుంచి నెల రోజుల ముందు వేసవి లో కురిసే అకాల వర్షాలకు దుక్కులు దున్నాలి. ఇలా దున్నితే వర్షాలు కురియగానే నీరు భూమికి ఇంకుతుంది. భూమి కోతకు గురి కాకుండా ఉంటుం ది. దుక్కులు దున్నడంతో భూమిపై పొరలు కిందకు కింది పొరలు పైకి వచ్చి భూమి సారవంతం అవుతుంది. భూమిలో తేమశాతం కూడా పెరు గుతుంది. పంటలకు హాని చేసే పురుగులు చనిపోయి కొంత మేర కలుపు మొక్కల నివారణ కూడా జరుగుతుంది.

● తగ్గిన పశువుల పెంట, చెరువు మట్టి వాడకం..

వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో రైతులు పశువులను పెంచ డం లేదు. దీంతో పశువుల పెంట లేకుండా పోయింది. పశువుల పెంట దొర కనప్పుడు రైతులు చెరువు మట్టి పోసేవారు. గతప్రభుత్వం చెరువుల్లో పూడి కలు తీయడంతో ఇప్పుడు చెరువుల్లోనూ, ఒండ్రు మట్టి లభించడం లేదు. రైతులు భూమిని ప్రతి యేటా దున్నడం, రసాయన ఎరువులు వేయడం తప్ప సేంద్రీయ ఎరువుల వాడకపోవడంతో భూసారం దెబ్బతింటుంది. ఏడా ది ఏడాదికి పంట దిగుబడి తగ్గుతుంది. సేంద్రీయ ఎరువులు వాడకుండా రసాయన ఎరువుల మాత్రమే వాడటం వల్ల భూమిలో సూక్ష్మ జీవులు నశిం చిపోతున్నాయి. గతంలో రసాయన ఎరువులు వాడటంతో ఇప్పుడు వేస్తున్న రసాయన ఎరువుల్లో 30 శాతం మాత్రమే మొక్కలకు అందుతున్నాయని రైతులు ప్రతి సారి పశువుల పెంటపోయాలని, లేదా పచ్చి రొట్టె ఎరువు వేయాలని అప్పుడే భూసారం పెరుగుతుందని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

కాలం చెల్లిన వంతెన

● పట్టింపు లేని రోడ్లు భవనాల శాఖ అధికారులు

● ఇరుకుగా ఉన్న వంతెన వాహనదారులు ఇక్కట్లు..


వంతెన సమీపంలో ప్రమాద సూచికలు లేని మూల మలుపులు


నిజాంసాగర్ ప్రధాన కాలువపై ఇరుకైన వంతెన ఇదే

నిజాంసాగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన ఇరుకు వంతెనలతో కష్టాలు తప్పడం లేదు. దీంతో రోడ్డు భవనాల శాఖ అధికారులు, పాలకులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. కాలం చె ల్లిన వంతెన నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక ఉభయ జిల్లా రైతాంగానికి సాగునీరు అందించేందుకు ప్రధాన కాలువ ని ర్మించారు. ఎల్లారెడ్డి నాందేడ్ ప్రాంతాలకు వెళ్లేందుకు వంతెన నిర్మా ణం చేపట్టారు. ఈ వంతెన నిర్మాణం చేపట్టి దాదాపు 100 సంవ త్సరాలు పూర్తయింది. వంతెన ఇప్పటికే కాలం చెల్లి పోయింది. వం తెన కున్న తిరుపక్కల పిట్టగోడలు రాకపోకలు తాకిడికి కూలి పో తూనే ఉన్నాయి. కంటి చూపుగా తోడు భవనాల శాఖ అధికారు లు మరమ్మతులు చేస్తూ చేతులు కలుపుకుంటూ ఉన్నారు. ఈ వంతెనపై ఎదురెదురుగా వాహనాలు వస్తే వాహనదారులు అనేక పాట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు ఒకే సారి వెళుతూ ఉండడంతో వంతెన కృంగిపోతుందని భయంతో వాహన దారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఈ వంతెనపై వెళ్లాల్సి వస్తుంది. ఈ వంతెన సమీపంలో రెండు పక్కల కూడా మలుపులు ఉన్నప్పటికీ ఎదురుగా వచ్చే వాహనాలు కనబడలేక పోతున్నాయి. రోడ్డు భవనాల శాఖ అధికారులు ఈ వంతెన సమీపంలో మలుపులు ఉన్నాయంటూ హెచ్చరిక బోర్డులు పెట్టాలనే ఆలోచన లేకపోయిం ది. దీంతో ఈ వంతెన గుండా వెళ్లాలంటే ప్రజలు వాహనదారులు భయాందోళన చేస్తున్నారు. ఈ రహదారి గుండా మంత్రులు, వీఐపీ అధికారులు వస్తూ పోతుంటారు. కాని కాలం చెల్లిన వంతెన నిర్మాణానికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల సర్వత్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించి నిజాంసాగర్ ప్రధానకాలువపై ఉన్న ఇరుకైన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

హసాకొత్తూర్ పాఠశాలలో

వరుసగా 14వ సారి వంద శాతం ఫలితాలు

● చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్న విద్యార్థులు

కమ్మర్‌పల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) ఇటీవల విడుదలైన పద వ తరగతి పరీక్ష ఫలితాల్లో కమ్మర్‌పల్లి మండంలోని హ సాకొత్తూర్ ఉన్నత పాఠశాల వందశాతం ఉత్తీర్ణ సాధిం చి మండలంలోనే వరుసగా 14 సారి వంద శాతం రిజల్ట్ సాధిస్తూ ముందు వరసలో నిలిచింది. 2011-2012 విద్యా సంవత్సరం నుంచి వరుసగా వంద శాతం రిజల్ట్‌ను సొంతం చేసుకుంటూ వస్తుంది. వందశాతం రిజల్ట్ సాధించిన ఈ పాఠశాల మహమ్మారి కరోనా సమయంలో రెండు సంవత్సరాలు పోను 12 సార్లు వరుసగా వందశాతం ఉత్తీర్ణతను సాధించిం రికార్డుల్లో నిలిచింది. మండల కేంద్రానికి 4 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ పాఠశాల గతంలో ఒక ఐఏఎస్ (కోట అంబరిష్ కలెక్టర్), ఒక ఐఎఫ్ఎస్ (పద్మనాభ రెడ్డి ఇండియన్ షోషల్ ఫారెస్ట్) లాంటి వారిని అం దించిన చరిత్ర ఈ పాఠశాల నిలిచింది. గతం నుండి నేటివ రకు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నత


మాజీ ఐఎస్ఎఫ్ పద్మనాభరెడ్డి


పూర్వ విద్యార్థి మాజీ ఐఏఎస్ కోట అంబరిష్


హసాకొత్తూర్ పాఠశాల

చదువుల్లో రాణిస్తు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. తమ పాఠశాల వరుసగా వదంశాతవ ఉత్తీర్ణలతో ముందువరసలో నిలవడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసమూర్తి, ఆనంద్, రాంపాల్, నరేందర్, జాన్ షహీద్ షేక్, జయంతి తదితర ఉపాధ్యాయులును గ్రామస్తులు అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాఠశాలలో విద్యాభ్యసం చేసిన ఎంద రో విద్యార్థులు ఉన్నతస్థాయిలో నిలిచారు గ్రామానికి చెంది న నలిమెల రాజేశ్వర్ ప్రస్తుతం దుబాయిలో యునివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన డాక్టర్ లక్ష్మ అవినాష్ ఆయన బృందం సభ్యులకు అల్జిమర్స్ వ్యాధి తొలి దశ కనుగొనేందుకు ప్రపంచ బ్యాంక్ ద్వారా 20లక్షల ప్రాజెక్ట్ దక్కించు కున్నారు. ఎందరో విద్యార్థులు ఉ న్నతస్థాయిలో స్థిరపడ్డారు. కాగా అటు చుదువులో రాణించడంతో పాటు క్రీడల్లోను సత్తా చాటుతున్నారు జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారిణి పీడీ మాధురి నేతృత్వంలో రాష్ట్ర జాతీయస్థాయి క్రీడల్లో విజయాలు సాధించారు. ఇటీవలే సీనియర్ మహిళల విభాగంలో


పూర్వ విద్యార్థి అవినాష్


పూర్వ విద్యార్థి రాజేశ్వర్



వందశాతం ఉత్తీర్ణత సాధించిన హసాకొత్తూర్ పాఠశాల విద్యార్థులు

ఈ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ప్రతిభ, సంగీత, అక్షర రాష్టజట్టుకు ఎంపికయ్యారు. ఇదే గ్రామానికి చెందిన మాజీ ఐఏఎస్ అధికారి ఈ పాఠశాల పక్కనేగల తన సొంత ఇంటిని పాఠశాలకు విరాళంగా ఇవ్వడంతో అక్కడే జీడీఎఫ్ నిధులతో గదినినిర్మించి అందులోనే కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుచేసి విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు.


రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన హసాకొత్తూర్ విద్యార్థినులు



మాట్లాడుతున్న డీఈ రమేష్

గ్రామాల్లో విద్యుత్ భద్రత వారోత్సవాలు

మోపాల్, మే3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తెలుసుకునేందుకు విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు డీఈ రమేష్ తెలిపారు. శనివారం మండలంలోని రాణాకుర్దు గ్రామంలో విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగానే ప్రతి గ్రామంలో విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా సభ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. విద్యుత్ ప్రమాదాలు చాలా జరుగుతున్నాయని వీటి విషయంలో అధికారులు నిర్లక్ష్యం ఉండటం వల్ల మూగజీవులు, మనుషులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని గ్రామీణ రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలా డుతున్నాయని దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఈదురు గాలులతో విద్యుత్ తీగలు తెగిపోయి ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. సమావేశంలో ఏడీఈ మల్లేషం, ఏఈ నాగశర్వాని, లైన్‌మెన్లు శ్రీనివాస్, మాజీ సర్పంచులు నారాయణరెడ్డి, అనంతరెడ్డి, సూర్య రెడ్డి, వీడీసీ పెద్దలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'20న నిర్వహించే ఒక్కరోజు సమ్మెను విజయవంతం చేయండి'



సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, మే3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులకు వ్యతిరేకంగా చేస్తున్న చట్టాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీన ఒక్కరోజు సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ ఓమయ్య పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల గుండెకాయ లాంటి 29 చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లను తీసుకురావడం జరిగిందని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సివిల్ సప్లై కార్పొరేషన్ కార్మికులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను, నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని అన్నారు. సివిల్ సప్లై కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులతో చర్చించి స్థలాలను కేటాయించి సొంత గోదాములను నిర్మించాలని అన్నారు. కార్మికుల కనీస పెన్షన్ 6వేలకు పెంచాలని, 7గురు సభ్యులు ఉంటే యూనియన్ రిజిస్ట్రేషన్ చేసే పాత ప్రక్రియను పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఈనెల 20న ఒక్కరోజు సమ్మెను చేపడుతున్నామని, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సివిల్ సప్లై కార్పొరేషన్ కార్యాలయంలోని జిల్లా మేనేజర్‌ను కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్ రావు, కార్యదర్శి హన్మాండ్లు, సివిల్ సప్లై కార్పొరేషన్ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవేందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల బాలికపై వృద్ధుడి అత్యాచారం

డిచ్‌పల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేసిన ఘటన డిచ్‌పల్లిలోని ఓ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డిచ్‌పల్లి మండలంలోని ఓ గ్రామంలో ఆరు ఏళ్ల బాలికపై బాలిక ఇంటి పక్కనే గల 60 ఏళ్ల వృద్ధుడు బాలికకు మాయ మాటలు చెప్పి తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బాలిక మౌనంగా ఉండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వివరాలను అడుగగా బాలిక విషయాన్ని తెలిపింది. దీంతో బాధిత బాలిక కుటుంబ సభ్యులు శనివారం డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధుడిని రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



వసతులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్



మున్సిపల్ ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్

సుభాష్‌నగర్, మే3 (ఆంధ్రజ్యోతి): వెల్నెస్ సెంటర్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు జర్నలిస్టులకు, ఉద్యోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పాత మున్సిపల్ కార్యాలయం భవనంలో ఉన్న వెల్నెస్ సెంటర్‌ను శనివారం నుడా చైర్మన్ కేశవేణు, నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఆరోగ్య పరీక్షలు చికిత్స కోసం వచ్చే రిటైర్డ్ ఉద్యోగులకు సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని వెల్నెస్ సెంటర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వెయిటింగ్ హాల్‌తో పాటు స్త్రీ, పురుషులకు వేరువేరుగా టాయిలెట్స్, ఔషధాలు పంపిణీ చేసే గదులను అందుబాటులోకి తేవాలన్నారు. వెల్నెస్ సెంటర్‌కు ఆనుకొని ఉన్న గదులకు మరమ్మతులు చేయడంతోపాటు కొత్తగా వెయిటింగ్‌హాల్ నిర్మించాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని పనులను సత్వరమే చేపట్టాలన్నారు. కలెక్టర్‌వెంట నిజామాబాద్ ఇంచార్జి ఆర్‌డీవో స్రవంతి, రిటైర్డ్ ఉ ద్యోగుల సంఘం నాయకులు రవీందర్‌రావు, భూమాగౌడ్, రామ్మోహన్ రావు, ప్రసాద్, ఏవో ప్రశాంత్, వెల్నెస్ సెంటర్ ఇన్‌చార్జి కృష్ణవేణి ఉన్నారు.

ప్రారంభమైన లక్ష్మీనర్సింహాస్వామి నవరాత్రి ఉత్సవాలు

నిజామాబాద్ కల్చరల్, మే3 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సింహాస్వామి నవరాత్రి ఉత్సవాలు శనివారం నుంచి ఆలయాల్లో ప్రారంభమయ్యాయి. సంవత్సరంలో వచ్చే అతిముఖ్యమైన నవరాత్రి ఉత్సవాల్లో లక్ష్మీనర్సింహాస్వామి నవరాత్రి ఉత్సవాలు ప్రత్యేకంగా భావిస్తారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాల్లో పుణ్యాహవచన, అఖండ దీపారాధన పూజలతో ప్రారంభించారు. లక్ష్మీనర్సింహాస్వామి ఆల యాల్లో కొలువుదీరిన స్వామికి వేదమంత్రాలతో పంచామృత అభిషే కాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయాల్లో ప్రహల్లాద చరిత్రతోపాటు లక్ష్మీనర్సింహాస్వామి శతకాలను పారాయణం చేస్తారు. 9 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించి నర్సింహాస్వామి జయంతి రోజుతో నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయి. జిల్లావ్యాప్తంగా లక్ష్మీనర్సింహాస్వామి క్షేత్రాలైన భీంగల్, జాన్కంపేట్, ఆర్మూర్, డిచ్‌పల్లి, మానిక్‌భండార్‌తో పాటు నగరంలోని చక్రంగుడిలోని లక్ష్మీ నర్సింహాస్వామి, నాందేవ్‌వాడ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం, రాణాగల్లిలోని లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం, నర్సింగ్‌పల్లిలోని ఆలయాల్లో ఉత్సవాలను ప్రారంభించారు.

ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన పదవ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గంగపుత్ర (గూండ్ల, బేస్తలకు మాత్రమే) విద్యార్థులకు ఈ నెల 10వ తేదీన నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలి రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో 360కి పైగా మార్కులు పొందినవారు, ఇంటర్మీడియెట్‌లో 900లకు పైగా మార్కులు వచ్చి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా కోశాధికారి శంకర్ 9490511114 నెంబర్‌ను సంప్రదించి ఈనెల 8వ తేదీలోగా పంపించాలని కోరారు. కులధృవీకరణ, మార్కుల మెమోతో ఖలీల్‌వాడిలోని కవిత పిల్లల ఆసుపత్రిలో సమర్పించాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

రోడ్లపై ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

సుభాష్‌నగర్, మే3 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఉన్న వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఒక ప్రకటనల తెలిపారు. జిల్లాలో రోడ్లపై ఎక్కడ చూసిన ధాన్యం కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తూకంలో ధాన్యం తగ్గుతుందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్లక్ష్యానికి అన్నదాతలు పండించిన శ్రమ ఆవిరవుతుందని జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామని హామీ ఇచ్చిన మంత్రుల మాటలు అరిగిపోయిన రికార్డులేనని ఈ సందర్భంగా విమర్శించారు. జిల్లాలో ధాన్యం రాసులు ఎక్కడికక్కడ కుప్పలుగా పేరుకుపోయాయని, వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



వివరాలు సేకరిస్తున్న అధికారులు

ధర్పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ధర్పల్లి,మే3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల జాబితా ఆధారంగా అధికారులు శనివారం సర్వే ప్రారంభించారు. ఎంపీడీవో బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈవో శ్రీనివాస్, గ్రామపంచాయతీ సిబ్బంది సర్వేలో పాల్గొన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మరియు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ఎంపిక చేసిన జాబితా ఆధారంగా ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. సర్వేలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి అర్హులైన వారిని ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చేర్చనున్నట్లు ఎంపీడీవో ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి'

నిజామాబాద్ అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు ఓమయ్య, సుధాకర్‌లు కోరారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 20న జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

సిరికొండ, మే3 (ఆంధ్రజ్యోతి): జనగణతోపాటు కులగణన చేయాలని కేంద్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శనివారం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు మాట్లాడుతూ అట్టడుగుస్థాయి ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందాలంటే కులగణన, జనగణ చేయాలని ప్రధాని మోదీ ఆర్డినెన్స్ తెచ్చినట్లు చెప్పారు. ఈ ఆర్డినెన్స్ ద్వారా కులమతాలకు అతీతంగా అభివృద్ధిఫలాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బాబురావు, రాజేందర్, ప్రభాకర్, రంజిత్‌రెడ్డి, గోవింద్, గంగారెడ్డి పాల్గొన్నారు.



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న సిర్నాపల్లి గ్రామస్థులు

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని ఎంపీడీవోకు ఫిర్యాదు

ఇందల్వాయి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్నాపల్లి గ్రామం ఇందిరమ్మ కాలనీలో గల ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేస్తున్నారని సిర్నాపల్లి గ్రామస్థులు శనివారం ఎంపీడీవో అనంతరావు తహశీల్దార్ వెంకట్రావుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గతంలో ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇళ్ల స్థలాలను కేటాయించింది. ఆ స్థలాల్లో కొందరు ఇళ్లను సైతం నిర్మించుకున్నారు. తమకు కేటాయించిన స్థలం కాకుండా ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనేఉన్న స్థలాలను ఇంటి యజమానులు అదే అదనుగా భావించి ఆర్‌అండ్‌బీ రోడ్డుపక్కన డ్రైనేజీ నిర్మాణం చేపట్టే స్థలాన్ని ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. అది గమనించిన సిర్నాపల్లి గ్రామస్థులు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయొద్దని పలుసార్లు ఇంటి యజమానులకు హెచ్చరించారు. గ్రామస్థుల మాటలను లెక్కచేయకుండా రోడ్డు స్థలాన్ని, డ్రైనేజీ కట్టే స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి ఇళ్లను, బాత్‌రూమ్‌లను, ఇతర షెడ్డులను నిర్మించడంతో గ్రామస్తులు ఏకమై శనివారం ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి అక్రమ కట్టడాలను తొలగించారు. అనంతరం ఎంపీడీవో అనంతరావుకు తహశీల్దార్ వెంకట్రావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేశారు. గ్రామంలో ఎవరైనా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే అడ్డుకుంటామని గ్రామస్తులు తెలిపారు.

• ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటాం: ఎంపీడీవో అనంతరావు

గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమణ చేస్తున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించడం నేరం. కబ్జాకు పాల్పడివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.



విరాళం అందజేస్తున్న దృశ్యం

రాంనగర్‌లో రామాలయ నిర్మాణానికి రూ.51వేల విరాళం

నందిపేట, మే3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాంనగర్‌లో నిర్మిస్తున్న రామాలయానికి శనివారం పెద్దోల్ల దేవన్న, పెద్దోల్ల రవి, ఎర్రం పెద్దోల్ల ముఖేష్ రూ.51వేలు విరాళం అందజేశారు. పెద్దకాపు లింగన్న తండ్రి పెద్దకాపు నడ్పి ముత్తెన్న జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.51వేలు నగదును ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించినందుకు ఆలయ కమిటీ సభ్యులు దాతలను శాలువాతో సత్కరించారు. ఆలయ ప్రారంబోత్సవం, విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మంద నడ్పి సాయన్న, ఏలిగేటి రాజు, బుక నారా యణ, డీలర్ సీతారాం, గంగాధర్ తదితరులు ఉన్నారు.

'సమాజ సేవలో రోటరీ క్లబ్ సభ్యులు ముందుండాలి'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, మే3 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఏం కావాలో తెలుసుకుని రోటరీ సభ్యులందరూ సేవలందించాలని, అప్పుడే విజయవంతమైన నాయకులు అవుతారని రోటరీ డిస్ట్రిక్ 3150 గవర్నర్ శరత్ చౌదరి సూచించారు. నిజామాబాద్ రోటరీ క్లబ్ జెమ్స్ ఆధ్వర్యంలో శనివారం డిచ్‌పల్లి బర్ధిపూర్ శివారులో గల ఓ స్టార్ హోటల్‌లో రీజినల్ పరిధిలోని 39 రోటరీక్లబ్‌లకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులకు రెండురోజులశిక్షణ కార్యక్రమాన్ని శరత్ చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ నియమాల మేరకు సభ్యులందరూ కలిసి కట్టుగా పనిచేస్తే విజయం తథ్యమన్నారు. ఎలక్ట్రిక్ గవర్నర్ రాం ప్రసాద్ మాట్లాడుతూ సభ్యులందరూ కలిసి మెలిసి ఐక్యంగా ఉండి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. క్లబ్‌లో పనిచేస్తున్న సభ్యులు వెళ్లిపోతున్నారని, వారి అసంతృప్తికి కారణం ఏంటో తెలుసుకోని వారిని మోటివేట్ చేసి బయటికి వెళ్లకుండా చూడాలని సూచించారు. క్లబ్ సభ్యులు కోటి మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నమన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు జిల్లా గవర్నర్ లు చేప్పిన బాధ్యతలు పాటించలన్నారు. గుంటూరు కి చెందిన వడ్లమాని రవి బెస్ట్ ప్రెసిడెంట్‌గా ఎంపికైనట్లు తెలిపారు. మే 7న రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డును అందుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్, కార్యదర్శి గౌరి శంకర్, కన్వీనర్ రంజిత్ సింగ్, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వృథాగా పోతున్న తాగునీరు

• పట్టించుకోని అధికారులు



వృథాగా పోతున్న నల్లా నీరు





లీకేజీ అవుతున్న నీరు

మోపాల్, మే3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు వృథా పోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అసలే వేసవికాలం అనేక గ్రామాల్లో తాగునీటికి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం నల్ల కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రజలు గ్రామస్థాయి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గత రెండు మూడు సంవత్సరాల క్రితం మండలంలోని మారుమూల గ్రామీణ ప్రాం తాలతో పాటు గిరిజన తండాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఇదిలా ఉండగా తాగునీటి సమస్యపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి మిషన్ భగీరథ ద్వారా నీటిని ప్రజలకు అందజేస్తున్నారు. ఇదిలా ఉంటే మండలంలోని న్యాలకల్, రాణాకుర్దు గ్రామాల్లో నీరు వృథాగా పోతున్నా పట్టించుకున్నవారే లేరు. ఎవరికి అవసరం ఉంటే వారు బోరు చాలు చేసి వెళ్లిపోతున్నారు తప్ప బంద్ చేసేవారు లేకపోవడంతో నీరంతా వృథాగాపోతోంది. మండలంలోని న్యాల్‌కల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న బోరు మోటారు ఎప్పటికీ చాలు ఉండటంతో నీరువృథాగాపోతోంది. ఇకపోతే మండలంలోని మంచిప్ప నుంచి నిజామాబాద్ నగరానికి వచ్చే తాగునీరు రాణాకుర్దు గ్రామ సమీపంలో పైప్‌లైన్ లీకేజీ అయి రోజుకు వేలలీటర్ల నీరు వృధాగాపోతుంది. ఈ దారి గుండానే అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తూపోతుంటారు తప్ప నీరు లీకేజీ అవుతున్న విషయాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో తాగునీరు అంతా వృథాగా పోతుందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పైప్‌లైన్‌కు మరమ్మతుల పేరుతో నగర పులపాలక శాఖ అధికారులు ప్రతీ సంవత్సరం వేల రూపాయలను ఖర్చు చేస్తున్నారు తప్ప వృథాగా పోయేనీరు అరికట్టలేకపోతున్నారని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో వృథాగా పోతున్న నీటిపై ప్రత్యేక దృష్టిపెట్టి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.140	రూ.250	రూ. 270



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.96,800	రూ.89,350	రూ.995

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : హిట్-3 (9.50, 1.05, 4.20, 7.35, 10.50)
స్క్రీన్-2 : రిట్రో (10.10, 4.25, 10.40)
: తండర్‌బోల్ట్స్ (3డి తెలుగు) (1.35, 7.50)
స్క్రీన్-3 : రైడ్-2 (హిందీ) (10.00, 4.25, 10.50)
: రిట్రో (1.00, 7.25)
స్క్రీన్-4 : తుదురం (10.15, 1.35)
: సారంగపాని జాతకం (4.55)
: రైడ్-2 (హిందీ) (7.45)
: జింఖానా (10.45)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : హిట్-3 (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : తండర్ బోల్ట్స్ (ఇంగ్లీష్) (11.00, 4.40)
: రి ట్రో (1.30, 7.20, 10.30)
స్క్రీన్-3 : రైడ్-2 (హిందీ) (11.00, 1.40, 4.30, 10.30)
: తండర్ బోల్ట్స్ (ఇంగ్లీష్) (7.40)

లలితామహాల్ : రిట్రో (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : తండర్ బోల్ట్స్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : రైడ్-2 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : హిట్-3 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్